# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 17, ఏప్రిల్ 2026


# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



## ముగ్గురు అరెస్టు, పరారీలో సూత్రధారి

**తాండూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. తాండూర్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు డిసిపి వెల్లడించారు. బెల్లంపల్లి నుండి తాండూర్ కు నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్నారని పక్కా సమాచారం మేరకు తాండూర్ ఎస్సై ప్రసాద్, మండల వ్యవసాయ అధికారిణి కొండలే సుష్మ పోలీసు సిబ్బంది బుధవారం సాయంత్రం బోయపల్లి బోర్డ్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు నిర్వహించారు. బెల్లంపల్లి వైపు నుంచి వస్తున్న ఒక ఆటోను తనిఖీ చేయగా 150 కేజీల నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. భీమిని మండలం నారాయణపూర్ ఎస్సీ కాలనీలో మిగతా 2లో..



## ప్రణాళికాబద్ద అభివృద్ధితో

# పల్లెల్లో కొత్త దిశ...

*** ఎమ్మెల్సీ దండే విఠల్**

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

ప్రణాళికబద్ధమైన అభివృద్ధి ద్వారానే గ్రామాల సమగ్ర రూపాంతరం సాధ్యమని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ పల్లెల్లో స్పష్టమైన మార్పులు తీసుకువస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సన్నాక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జూన్ వరకు అమలు చేసే ఈ ప్రత్యేక కార్యక్రమంలో పారిశుద్ధం, ఆరోగ్యం, విద్య, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పెంచికల్ పేట్ లో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రోత్సాహం కోసం క్రికెట్ మైదానం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరా అంశంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పోడు భూముల సమస్యలపై అటవీశాఖ అధికారులతో చర్చించారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని నర్సరీలలో మొక్కలను సిద్ధం చేసి, విస్తృతంగా నాటేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణ పూర్తయ్యే నాటికి పెంచికల్ పేట్ మండలం జిల్లాలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, తాసిల్దార్ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, అటవీశాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణ ప్రక్రియలో

# రక్షణ చర్యలు తీసుకోవాలి

**★ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

వేసవి కాలం నేపథ్యంలో వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు, సిబ్బందిని ఎండ తీవ్రత నుంచి రక్షించడానికి నిర్దిష్ట చర్యలను తప్పక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, మంచిర్యాల, గద్వాల్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం అత్యవసర హెచ్చరికను జారీ చేసిందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడ కల్పించేందుకు అన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురి కాకుండా రైతులు తమ ధాన్యాన్ని ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల మధ్య కాలంలో ధాన్యం దించడం, తూకం వేయడం వంటి శారీరక శ్రమతో కూడిన బహిరంగ పనులను పరిమితం చేయాలని, రైతులు ఎండలో వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి, ఖచ్చితమైన టోకెన్, అపాయింట్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 108 అంబులెన్స్ సేవకు సంబంధించిన సంప్రదింపు వివరాలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. రైతులు ఎద్దుల బండ్లపై వస్తుంటారని ఈ క్రమంలో జంతువుల కోసం ప్రత్యేక నీడ ఉన్న ప్రదేశాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని, కొన్ని ప్రదేశాలలో తీవ్రమైన వేడి కారణంగా అకస్మాత్తుగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని మిగతా 2లో..



## వ్యాధుల నియంత్రణలో భాగంగా

# దోమల వృద్ధిని అరికట్టాలి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

వ్యాధుల నియంత్రణలో భాగంగా జిల్లాలో దోమల వృద్ధిని అరికట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు జిల్లాలో కీటక జనిత మిగతా 2లో..



# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బోయపల్లి బోర్డు వద్ద నివాసం ఉంటున్న పూస సుబ్బారావ్, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్ కు చెందిన ఆటో డ్రైవరు మగ్దూంలను పోలీసులు అదుపులోకి తీసుకుని, నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాకు చెందిన గుంటుపల్లి శ్రీనివాస్ వద్ద నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసినట్లు డిసిపి తెలిపారు. సూత్రధారి శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు డిసిపి తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు చేస్తాం...నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంచిర్యాల డిసిపి భాస్కర్ హెచ్చరించారు. రైతులు నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గే అవకాశాలున్నాయన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల పర్యావరణంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గ్లైసిల్, నకిలీ విత్తనాలు వాడటం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు ప్రభుత్వం సరఫరా చేసి పత్తి విత్తనాలను వాడాలన్నారు. లైసెన్సు, అనుమతి పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు, మందులు కొనుగోలు చేసి రసీదును తప్పకుండా తీసుకోవాలని డీసీపీ సూచించారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి నకిలీ విత్తనాల కొనుగోలు చేయవద్దన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వాడకం వలన జరిగే అనర్థాలు, నష్టాల గురించి పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టుతున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు వాడిన, అమ్మిన, కొనుగోలు చేసిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుష్మ పాల్గొన్నారు.

### నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

గ్లైసిల్ బీటి పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్న సంఘటన ఆసిఫాబాద్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయం లో ఆసిఫాబాద్ మండలంలో అక్రమ నకిలీ పత్తి విత్తనాల రవాణా జరుగుతున్నదనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆసిఫాబాద్ ఎస్ఐ బొజ్జి రావు, పోలీస్ సిబ్బంది గుండి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా అందులో 2 హెచ్టిపిఈ సంచుల్లో మొత్తం 80 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తాండూర్ కు చెందిన మహేష్ గా గుర్తించగా ఈ విత్తనాలను అంకిత్ (గుజరాత్) నుండి కొనుగోలు చేసి సాయి కిరణ్ ను డ్రైవర్గా తీసుకొని రైతులకు అమ్మేందుకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వీటి విలువ సుమారు రూ. 2 లక్షలు కాగా, నమూనాలను పరీక్ష కోసం సేకరించారు. అనంతరం నిందితుడి గోదాములో సోదాలు నిర్వహించగా, 14 హెచ్టిపిఈ సంచులు, 3 గన్నీ సంచుల్లో సుమారు 5.7 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి. వీటి విలువ సుమారు రూ. 14.25 లక్షలు ఉంటుందని, వాటిని సైతం స్వాధీనం చేసుకున్నాం. వీటికి సంబంధించిన పంచనామా నిర్వహించి నమూనాలు సేకరించారు. మండల వ్యవసాయ అధికారి మిళింద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్లో గురువారం కేసు నమోదు చేసి వారిని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించగా నిందితులు తమ తప్పును ఒప్పుకున్నారు. దీంతో వారిని న్యాయస్థానానికి హాజరుపరచగా రిమాండ్కు తరలించినట్లు ఎస్హెచ్ఓ తెలిపారు. రైతులు నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తడిపొడి చెత్తను వేరు చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్: ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ పురపాలక సంఘం 20వ వార్డులో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సూచించారు. ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా ఉంచి మున్సిపల్ వాహనాల్లో వేయాలని కోరారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, అలాగే ఇంట్లోనే సేంద్రియ ఎరువును తయారు చేసుకునే జహోమ్ కంపోస్టింగ్చ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు తమ బాధ్యతగా ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం స్థానిక చిల్డ్రన్ పార్కును తనిఖీ చేసి ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది నిత్యం నీరు పోయాలని, పార్కులో పారిశుధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు జెబా షేక్, చిలువేరు వెంకన్న, నాయకులు సమద్, ఎత్తేశం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం

**బెజ్జూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన ప్రగతి నివేదిక సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందరం కోసమే ప్రజా పాలన నిర్వహించడం జరిగిందని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన మండలంలోని ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికను వివరించారు. మండలంలోని అర్హులైన రేషన్ కార్డుదారులందరికి రేషన్ కార్డులు పంపిణీ చేశామని ఇంకా రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరుగుతున్నట్లు తహసిల్దార్ రామ్మోహన్ రావు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు వారి సమస్యలను అధికారులకు తెలియజేశారు. బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ మండలంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని ఈ వేసవికాలంలో విద్యుత్ కోతలతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. లుంబిని నగర్ సర్పంచ్ కొండ రాంప్రసాద్ తమ గ్రామం గత కొన్ని తరాలుగా ఉంటున్నప్పటికీ తమను అటవీ శాఖ అధికారులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇలను మంజూరు చేస్తే వాటిని కట్టుకోకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. గ్రామ సభల్లో గ్రామానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదని, ఇలా గైరహాజరయితే వారికి తమ సమస్యలు ఎలా తెలుస్తాయని సులుగుపల్లి సర్పంచ్ సోయం చిన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సమస్యలు అన్నిటినీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండల ప్రత్యేక అధికారి నదీమ్ తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ నాగరాజు, ఏఈ అంజల్ కుమార్, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు ఎస్సి కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారుల ధృవపత్రాల పరిశీలన

**కాగజ్నగర్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

ఎస్సి కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో శుక్రవారం (17వ తేదీ) ఉదయం 11 గంటలకు కాగజ్నగర్ ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలని ఎంపీడీవో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రుణాల మంజూరు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు పరిశీలించడం జరుగుతుందని, అభ్యర్థులు తమ దరఖాస్తుకు సంబంధించిన అన్ని అవసరమైన పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన వారికి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణయించిన తేదీ, సమయానికి తప్పకుండా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియలో రక్షణ చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంలో వరి తడవకుండా నివారించడానికి టార్పాలిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి దాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

### వ్యాధుల నియంత్రణలో భాగంగా

## దోమల వృద్ధిని అరికట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాధుల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మలేరియా, డెంగ్యూ, బోదకాలు వంటి వ్యాధులను ఆదిలోనే గుర్తించి నివారించాలని స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిలో పారిశుధ్య పనులకు సరిపడా నిధులు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చాలి. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. సిబ్బంది కొరత ఉన్న చోట అదనపు కార్మికులను నియమించుకుని పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు నిర్వహించి నెలవారీ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా విద్యా సంస్థలను శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. జిల్లాలో మందులు, ద్రావణాలు, పడకలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి. బోదకాలు నివారణకు నిర్దేశించిన మందులను బాధితులు వాడేలా ప్రోత్సహించాలి. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మధ్యాహ్నం 12 నుండి 4 గంటల మధ్య ప్రజలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు చెప్పాలి. అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండలో వెళ్లేవారు గొడుగు, టోపీ వంటివి ధరించేలా చైతన్యం కల్పించాలి. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా.వేదవ్యాస్, టిహబ్ ప్రతినిధి డా.శిల్ప, డిపిఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.టి.ఎస్. శ్రీనివాస్, కిరణ్, ఆర్ఎస్ పద్మ వసుమతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అగర్గూడలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

**పెంచికల్పేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

యువత క్రీడాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండలంలోని అగర్ గూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని, ఓటమిని గెలుపుకు మార్గంగా తీసుకుని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విజేతగా నిలిచిన బెజ్జూర్ జట్టుకు ప్రథమ బహుమతి రూ. 30000 వేలు, రన్నర్ గా నిలిచిన అగర్ గూడ జట్టుకు రూ. 20000 వేల రూపాయలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లూరి రాజేశ్వరి, ఉప సర్పంచ్ వినోద్, పెంచికల్ పేట్ సర్పంచ్ షేక్ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సముద్రాల రాజన్న నాయకులు శ్రీనివాస్, అంజన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

# హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించండి

## జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్ - శ్రీరాంపూర్‌లో ఖఅరైవ్-అలైవ్' హెల్మెట్ అవగాహన భారీ ర్యాలీ

నస్పూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా చేపట్టిన ఖఅరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ నుంచి సింగరేణి జీఎం కార్యాలయం వరకు పోలీసులు, కార్మికులు, స్థానిక ప్రజలతో కలిసి ఈ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని, ఖనో హెల్మెట్ - నో ఎంట్రీ' నిబంధనను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ప్రమాదకరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, సింగరేణి కార్మికులు, ప్రజల భద్రతను పరిరక్షించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్, జైపూర్ సిఐ నవీన్ కుమార్, ఎస్సైలు రాజశేఖర్, మేకల సంతోష్, లక్ష్మీ ప్రసన్న, పోలీస్ సిబ్బంది, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హెల్మెట్ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్, ఇతర పోలీస్ అధికారులు

## వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరైన పత్తి రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:



న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని నిర్మల్ జిల్లా మాజీ జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డిని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఏపీ రాజ్యసభ సభ్యుడు నిరంజన్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దానసరి అనసూయ, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, షబ్బీర్ అలీలను పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి న్యూఢిల్లీలో కలుసుకున్నారు.

## సిరికొండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సదస్సు

సిరికొండ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అధికారుల సమక్షంలో గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన జూట్ బ్యాగులను ఈ సదస్సులో ప్రదర్శించారు. మహిళల నైపుణ్యాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని అధికారులు పేర్కొన్నారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను అధికారులు రుచి చూశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యతపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ దత్తాత్రి మాట్లాడుతూ.. ప్రజా పాలన ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలిగిందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామాల్లో అభివృద్ధి పనుల వేగవంతానికి ఈ ప్రణాళిక ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుకారం, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఇన్చార్జ్ ఎంపీడీఓ సంతోష్, స్పెషల్ ఆఫీసర్ ఫణీందర్, ఎస్సై పూజ, ఏఓ సుధారాణి, ఐకేపీ ఏపీఓ సంతోష్ కుమార్, హౌసింగ్ ఏఈ గౌస్ ఖాన్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, సూపర్‌వైజర్ సుమలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:



ముధోల్ నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే జీ. విఠల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండీని కలిసి నియోజకవర్గంలోని రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముధోల్ నియోజకవర్గంలో సుమారు 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేట్ ధర కంటే ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉందని, కొనుగోలు కేంద్రాలు లేకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం మండల కేంద్రాల్లోనే కాకుండా, రైతులకు అందుబాటులో ఉండేలా సబ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మార్క్‌ఫెడ్ ఎండీ సానుకూలంగా స్పందిస్తూ.. గురు, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో కేంద్రాలను ప్రారంభిస్తామని, సోమవారం నుండి ఇతర సబ్ సెంటర్లను కూడా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పిఠాధిపతి శిష్యులు

## ప్రాణ ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వానం

నార్నూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పూసద్‌లో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న సిద్ధ శ్రీ ప్రాణ ప్రతిష్ట మహోత్సవానికి నార్నూర్ సర్పంచ్ బానోత్ కావేరి, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్‌లకు ఆహ్వానం అందింది. గురువారం మాతంగ్ ఋషి సంస్కార కేంద్ర పిఠాధిపతి గజానంద్ మోలి శిష్యులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అరికిల్ల అశోక్, సంజీవ్ గాదెకర్, దుర్గే మహేందర్, కొమ్ము బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:



నిర్మల్ నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 19 కేంద్రాలు కావాలని ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ, కేవలం 2 కేంద్రాలను మాత్రమే మంజూరు చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు అధికంగా మొక్కజొన్న పండించిన దృష్ట్యా, ప్రతి మండలంలో కనీసం 3 లేదా 4 కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం జాప్యం చేస్తే, బీజేపీ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## ముదిరాజులు అన్ని రంగాల్లో రాణించాలి: జిల్లా నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

ముదిరాజులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింతగా ఎదగాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి రఘునాథ్, దర్శనం దేవేందర్ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ముదిరాజులు ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. స్వశక్తితో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ క్రమంలోనే ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను, వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యతలు స్వీకరించిన ముదిరాజ్ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్, పవన్ కుమార్, శశిరాజ్, రాజేశ్వర్, మొగిలి రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్, హనుమాండ్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే ప్రజాపాలన: డీఎల్‌పీఓ ప్రభాకర్

నార్నూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

ప్రజల వద్దకే ప్రజా పాలన చేరుతోందని డీఎల్‌పీఓ ప్రభాకర్ తెలిపారు. గురువారం నార్నూర్ మండలంలోని రాజులగూడ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సభలో సమర్పించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కొత్త పథకాలను ప్రవేశపెడుతోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కావేరి, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ గంగాసింగ్, ఎస్సై శ్రీసాయి, సీడీపీఓ శారద, హౌసింగ్ ఏఈ రాకేష్, ఏపీఎం రాజారాం, ఇతర శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



# గ్రామాలను అభివృద్ధి చేయడం కోసమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**వేమనపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



సమీక్ష సమావేశం మాట్లాడుతున్న అధికారులు

గ్రామాలను అభివృద్ధి చేయడం కోసమే ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపిడిఓ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో గల రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ జయహే తెలంగాణ, ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల కార్యాచరణ, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా చదివి వినిపించారు. కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సమయానికి సమావేశానికి హాజరు కాకపోవడంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి, గృహ జ్యోతి, చేయూత పెన్షన్ సంబంధించిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు గూర్చి అలాగే తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజల విజ్ఞప్తులను ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత కాలంలో పరిష్కారం చూపాలని సూచించారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపులో ప్రభుత్వ సహకారం కీలకమని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని, యూరియా యాప్ బుకింగ్ ద్వారా మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, నిషేధిత గ్లైసిల్ విత్తనాలను వాడొద్దని మండల వ్యవసాయ అధికారి వీరన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, ఎంఈవో శ్రీధర్ రెడ్డి, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, డా.అన్వేష్, ఆర్ఐ ఖలీక్, ఏపీవో మహేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి, స్థానిక సర్పంచ్ వుప్పులపు సాయి కృష్ణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, సర్పంచులు కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, దుర్గం భాగ్య లక్ష్మి, ఆలం లక్ష్మణ్, ఎనగంటి మల్లీశ్వరి, దుర్గం విగ్నేష్, ఒడిల కళ్యాణి సుధాకర్, సిడెం శ్రీలత అశోక్, అవులమారి పున్నం, కొండి మానస శ్రీకాంత్, మండల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్షా సమావేశం

**సారంగాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల పాలన ప్రణాళిక అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఐదు విడతలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తాగునీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అలాగే సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు వంటి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది, మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఎంఈఓ మహేందర్, ఏఓ హైమద్, ఏపీఎం మాధురి, విద్యుత్ ఏఈ సాయికుమార్, పీఆర్ ఏఈ వేణు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ కొమ్రే వార్ కిరణ్ కుమార్

## రేపు నాలుగు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**భైంసా, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఆందోళన చెందవద్దని, అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ కొమ్రే వార్ కిరణ్ కుమార్ తెలిపారు. భైంసా మండలంలోని మహాగం గ్రామంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేపటి నుండి బాసర, ముధోల్, లోకేశ్వరం, తానూర్ మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభమయ్యాయని, పంట దిగుబడి అధికంగా ఉన్నందున మరిన్ని కేంద్రాలతో పాటు అవసరమైన చోట్ల సబ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని, ప్రభుత్వం కల్పించే మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని సూచించారు. కేంద్రాల ఏర్పాటుపై ఇప్పటికే సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంగి రాజేశ్వర్, కారగిరి సాయినాథ్, గాడిషం శంకర్, సంకోళ్ల శంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేమనపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

వేమనపల్లి, నీల్వాయి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వేమనపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 09 గంటల నుండి మధ్యాహం 12 గంటల వరకు 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా వేమనపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వేమనపల్లి, రాజారం, ఒడ్డుగూడెం, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లంపల్లి, నీల్వాయి, మామడ, కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల,గొర్లపల్లి కొత్తపల్లి, దస్నాపూర్, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సి.ఓ.ఈ విద్యార్థుల ఎంపిక

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఈ) బెల్లంపల్లి విద్యార్థులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న డి. విశ్వతేజ, బి. రిషేంద్ర వర్మలు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి అండర్14 పోటీలకు ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో మార్చి 7 నుండి 9 వరకు నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్14 సాఫ్ట్‌బాల్ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున ఈ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. వారి కృషితో ఆదిలాబాద్ జిల్లా జట్టు గోల్డ్ మెడల్ (ప్రథమ స్థానం) సాధించింది. ఈ ప్రదర్శనతో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఈ విద్యార్థులు, ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో ఈ నెల 16 నుండి 22 వరకు జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ విషయాన్ని మంచిర్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎండి యాకూబ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ మాట్లాడుతూ, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. జాతీయ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్రానికి మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు చదువుతో సమానమని, రెండింటినీ సమానంగా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ తస్నీరు గోపి మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ క్రీడలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. జెడ్‌ఓ గిరిజ, మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య విద్యార్థులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చుకుర్తి రాజశేఖర్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.





## స్తంభాలు మార్చమంటే కరెంట్ కట్!

- మహిళా కౌన్సిలర్‌ను అవమానించిన అధికారి
- 6వ వార్డులో సింగరేణి అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని 6వ వార్డులో సింగరేణి పరిధిలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉన్న నేపథ్యంలో, వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని వార్డ్ కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అయితే, సమస్యను పరిష్కరించే బదులు సింగరేణి అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం స్థానికుల్లో ఆందోళనకు దారితీసింది. ఈ విషయంపై స్థానికులు ప్రశ్నించగా, సింగరేణి కరెంటు స్తంభాలు లేవు, అందుకే కరెంట్ కట్ చేశాం అని అధికారులు సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి గత రెండు రోజులుగా సింగరేణి అధికారి పిల్లి శ్రీనివాస్‌ను సంప్రదించి, వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని మళ్లీ వినతిపత్రం అందజేశారు. అయితే, రేపు చూస్తాం అంటూ ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రెండు రోజులుగా కరెంట్ లేకపోవడంతో 6వ వార్డులో నీటి సరఫరా నిలిచిపోవడం, ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోత పెరగడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోయారు. సమస్యపై స్పందించాలంటూ బస్తీ మహిళలతో కలిసి కౌన్సిలర్ సంబంధిత అధికారిని కలవడానికి వెళ్లగా, అవమానకరంగా మాట్లాడి లోపలికి అనుమతించకుండా తలుపులు మూసేసి వెళ్లిపోయినట్లు ఆరోపించారు. వార్డ్ కౌన్సిలర్‌ను ఇలా అవమానిస్తే, సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి అంటూ కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బెల్లంపల్లి పట్టణంలోని ఇతర సింగరేణి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సాధారణంగా కొనసాగుతుండగా, కేవలం 6వ వార్డులో మాత్రమే కరెంట్ నిలిపివేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సింగరేణి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, పాత స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే రోడ్డు మీద ధర్నా చేపడతామని హెచ్చరించారు.

### అరైవ్ అలైవ్ 2026 కార్యక్రమంతో

# రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి




**బెల్లంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణ భద్రతను కాపాడడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ 2026 రెండవ దశ కార్యక్రమాన్ని బెల్లంపల్లి పట్టణంలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని రోడ్డు భద్రతపై పలు కీలక సూచనలు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం, ప్రమాదాలను తగ్గించడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచడం, సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. గత కొద్ది రోజులుగా ఈ క్యాంపెయిన్‌ను నిరంతరం నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ముఖ్య కూడళ్ల వద్ద హెచ్చరిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం, విద్యాసంస్థలు, మార్కెట్ ప్రాంతాలు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా లేన్ డిసిప్లిన్ డ్రైవ్ చేపట్టి తప్పుగా ఓవర్‌టేకింగ్ చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎడమ లేన్‌లో ప్రయాణం తప్పనిసరి చేస్తామని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని, పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులకు సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయడానికి తనిఖీలు కొనసాగిస్తున్నామని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపకుండా ఉండేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ, బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణ పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ఎస్సై కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు.



## గ్రామాలను అభివృద్ధి చేయడం కోసమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**జన్నారం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

గ్రామాలను అభివృద్ధి చేయడం కోసమే ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ బక్కయ్య ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌లు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు జన్నారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సభను 29 గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో 99 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉదయ్ కిరణ్, డాక్టర్ ఉమాశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అంబలి పంపిణీతో మానవతా విలువలను చాటుతున్న తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంబలి పంపిణీ కార్యక్రమం సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తోంది. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ప్రాంతంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదలు, రోజువారీ కూలీలు, ఆటో డ్రైవర్లు, బాటసారులు, చిన్నచిన్న వ్యాపారులు వంటి వివిధ వర్గాలకు చెందిన 500 మందికి పైగా ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. వేసవి కాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య శరీరానికి శీతలతను అందించే అంబలి పంపిణీ చేయడం ద్వారా అవసరమైన వారికి ఉపశమనం కలిగించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ నిరంతరంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం ఇప్పటికే 22వ రోజుకు చేరుకోవడం విశేషం. ప్రతి రోజు భిన్న దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ రోజు కార్యక్రమానికి మందమర్రి ప్రాంతానికి చెందిన దాత కొండ శ్రీనివాస్ ఆర్థిక సహకారం అందించారు. వారి సహకారంతో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు అంబలి పంపిణీ చేయడం సాధ్యమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ, సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పేద ప్రజలకు, కూలీలకు ఈ విధంగా అండగా నిలవడం గొప్ప విషయమని, వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సేవా తత్వాన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కంటెవాడ నాగేష్ కుమార్, గంటా శ్రీనివాస్, గరిగె రాజ్, ఏనుగు నరేష్, కుమార్, నాగుల లింగయ్య, తిప్పారపు రాజయ్య తదితరులు చురుకుగా పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హెల్మెట్ లేకపోతే కార్యాలయాల్లోకి నో ఎంట్రీ

### - మందమర్రి సీఐ రమేష్ కీలక నిర్ణయం

### - అరైవ్ అలైవ్‌లో భాగంగా కఠిన అమలు

**మందమర్రి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

రహదారి భద్రతపై అవగాహన పెంచడం, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా మందమర్రి పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై హెల్మెట్ లేకుండా ప్రభుత్వ కార్యాలయాలు, పెట్రోలు బంకులకు ప్రవేశం ఉండదని సీఐ పర్స రమేష్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మందమర్రి పోలీస్ స్టేషన్, ఎంఆర్ఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో నో హెల్మెట్ నో ఎంట్రీ నిబంధనను కఠినంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో తలకు గాయాలు కాకుండా ప్రాణాలను రక్షించుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రావాలని, లేనిపక్షంలో లోపలికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించే ముందు పోలీసు సిబ్బంది స్వయంగా హెల్మెట్ ధరించి ఆదర్శంగా నిలవాలని ఆదేశించారు. సురక్షిత ప్రయాణం – సుఖమయ జీవితం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసులు హెల్మెట్లు ధరించి పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ స్థానికులను ఆకట్టుకుంది.



## పోలీసుల ఆధ్వర్యంలో నో హెల్మెట్ నో ఎంట్రీ ప్రోగ్రాం

### - హెల్మెట్ లేకుండా ప్రభుత్వ కార్యాలయాలకు రాకూడదు

### - ద్విచక్ర వాహనదారులకు సూచించిన పట్టణ సీఐ బన్సీలాల్

**చెన్నూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

ఇకపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ద్విచక్ర వాహన దారులు తమ వెంట హెల్మెట్ తప్పకుండా తీసుకురావాలని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్, తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి కార్యాచరణ 99 రోజులు భాగంగా సర్పంచుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా ప్రభుత్వ కార్యాలయాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీపీఓ. వెంకటేశ్వర్ రావ్, ఎంపీడీవో మోహన్, ఎస్ఐ. సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణసాగర్ రావు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు

**జన్నారం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని చింతలపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం వీధికుక్కల దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. చింతలపల్లె గ్రామానికి చెందిన మెట్పెల్లి గంగాజల, బూరగడ్డ పుష్పలత, గట్టు శ్రీరామ్, గట్టు రాజన్న లపై దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు. చేతులపై, కాళ్ళపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు రెండు ఆవుల పైన కూడా కుక్కలు దాడి చేశాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మండలంలో వీధి కుక్కల దాడి రోజు రోజుకు పెరిగిపోతుందని, ఇప్పటికే చాలామంది తీవ్రంగా గాయాలపాలయ్యారని, వెంటనే అధికారులు వీధి కుక్కలు, పిచ్చికుక్కల పై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



# సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



నస్పూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కళాశాల ప్రిన్సిపల్ ఆర్. పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపల్ జి. అనూష, అధ్యాపక బృందంతో కలిసి అడ్మిషన్ల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభించడం జరిగిందని, 2018 నుండి ఇప్పటివరకు అత్యుత్తమ వార్షిక ఫలితాలతో విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో ఉన్నత విద్య, పోటీ పరీక్షల శిక్షణకు, ప్రతిరోజు విద్యార్థుల మానసిక వికాసానికి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బి.ఎ., బి.కామ్., బి.ఎస్సిలలోని వివిధ కోర్సులు అందించడం జరుగుతుందని, నిష్ణాతులైన మహిళ అధ్యాపకులచే బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జెస్, యూనిఫామ్, ట్రాక్ షూ, నోట్ బుక్స్, స్పోర్ట్స్ షూ, స్టేషనరీ అందించడం జరుగుతుందని, ఇంటర్నెట్ సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉందని, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం, సైన్స్ ల్యాబ్, 10వేలకు పైగా పుస్తకాలతో గ్రంథాలయం, ఎన్ఎస్ఎస్ 2 యూనిట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా కళాశాల కార్యాలయంలో /https://rdcmncl.blogspot.com/2026/04/application-for-degree-first-year-2026.html వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు. ఈనెల 27వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించి జూన్ 1వ తేదీ నుండి తరగతులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల మైదానంలో టవర్ నిర్మాణంపై ఆందోళన

**- రేడియేషన్ భయంతో వాకర్స్ అసోసియేషన్ నిరసన**

మందమర్రి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం సంఘటన స్థలంలో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సభ్యులు, ఈ విషయమై ఇప్పటికే సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటికీ ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతుండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల ప్రాంగణంలో టవర్ నిర్మాణం అనుచితమని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ తక్షణమే జోక్యం చేసుకుని టవర్ నిర్మాణ పనులను నిలిపివేసి, మరో అనుకూల స్థలానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లి వన్ టౌన్ పరిధిలో ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు కొనసాగింపు

బెల్లంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాలు భాగంగా, అరైవ్ అలైవ్ కార్యక్రమం నాలుగవ రోజు సోషల్ మీడియా మూవ్‌మెంట్ - ప్రభుత్వ అధికారులు నాయకత్వం అంశంతో విభిన్న కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ వి. కిరణ్ కుమార్ హాజరై పోలీస్ సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తూ, ట్రాఫిక్ నియమాల పాటనలో ప్రభుత్వ ఉద్యోగులు ముందుండాలని సూచించారు.

**హెల్మెట్ అండ్ సీట్ బెల్ట్ అవగాహన..**

పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని అవగాహన కల్పించారు. సీఐ శ్రీనివాసరావు స్వయంగా పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు తొడిగిస్తూ, ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ప్రచారం.. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ఫోటోలు, వీడియోలు, సందేశాలను వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా షేర్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక తనిఖీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్.. ఆటో రిక్షాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, రియర్ వ్యూ మిర్రర్లు వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్.. ఆటో, బస్సు, ట్యాక్సీ, స్కూల్ బస్సు డ్రైవర్లకు ప్రయాణికుల భద్రత, ఓవర్‌లోడింగ్ నివారణ, బాధ్యతాయుత డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ముందుగా మనమే ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని, చట్టాన్ని గౌరవించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఇళ్ల చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికే ఇవ్వాలి

**- మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్**

**- 28వ డివిజన్‌లో 99 రోజుల ప్రగతి ప్రణాళిక పారిశుధ్య పనుల పరిశీలన**

నస్పూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ఇళ్ల నుంచి వచ్చే చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారబోయకుండా మున్సిపల్ సిబ్బందికి మాత్రమే అందజేసి పారిశుధ్య నిర్వహణలో సహకరించాలని మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య ఈ కార్యక్రమానికి హాజరై డివిజన్ వ్యాప్తంగా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ అంతటా పర్యటించిన మేయర్ బృందం స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని పరిసరాల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళికాబద్ధమైన ఈ పారిశుధ్య పనుల ద్వారా నగరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మేయర్ వివరించారు. ప్రజల సహకారంతోనే పట్టణ సుందరీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ అమృత రాజ్ కుమార్, 27వ డివిజన్ కార్పొరేటర్ కొంగ్ర రాజేశ్వరి లింగయ్య, వార్డు ఆఫీసర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



28వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య



## ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఉండే విధంగా చూడటం మనందరి బాధ్యత

**- సర్పంచుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వాక్య**

**- చెన్నూరులో ప్రజాపాలన ప్రగతి కార్యాచరణ కార్యక్రమం**

చెన్నూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందేలా చూడటం మనందరి బాధ్యతగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల తహసీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మహేష్ ప్రసాద్ తివారి, సి.ఐ. బన్సీలాల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందే విధంగా అందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వరి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో సన్నరకం వడ్లకు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా దాదాపు 3 వేల 500 ఇండ్లు స్లాబ్ స్థాయి వరకు పూర్తయ్యాయని, అర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్లు రానివారు దరఖాస్తు చేసుకున్నట్లయితే మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.